

నేడు యథావిధిగా 'జగనన్నకు చెబుదాం'

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం : కలెక్టర్



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

0-5 సంవత్సరాలలోపు వయస్సు గల చిన్నారులందరికీ రెండు పోలియో చుక్కలు వేయించి వారి పోలియో రహిత సమాజానికి కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పిలుపునిచ్చారు. ఆదివారం హార్సిలీహిల్స్‌లోని ఎమర్జెన్సీ మెడికల్ కేంద్రంలో పిల్లలకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి మూడు రోజులపాటు మార్చి 5వ తేదీ వరకు చేపట్టే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1,93,946 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ కృషి చేస్తుందన్నారు. ప్రజల భాగ స్వామ్యంతోనే పోలియో నిర్మూలన వంద శాతం సాధ్యం అవుతుం దన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యల ద్వారా దేశ వ్యాప్తంగానే కాకుండా జిల్లాలో కూడా పోలియోను పూర్తి స్థాయిలో నిర్మూలించగలిగామన్నారు. పోలియో వైరస్ మన చుట్టూ లేకపోయినప్పటికీ పక్క దేశాలయిన పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల్లో కొంతవరకు పోలియో ప్రభావం ఉండటం వల్ల ముందస్తుగా ప్రతి ఒక్కబిడ్డను పోలియో నుండి రక్షించుకోవడం మన బాధ్యత అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలన్నారు. నిండు జీవితానికి రెండు చుక్కలు అన్న నినాదాన్ని సమాజంలో విస్తృత పరచడంలో జిల్లా ప్రజారోగ్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా నేడు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బూత్ లతోపాటు మున్సిపాలిటీల్లోని వార్డుల్లో, గ్రామాల్లో, బస్టాండులు, రైల్వే స్టేషన్లు, వలస కూలీలు ఉన్న చోట, జనం అధికంగా ఉన్నచోట పల్స్ పోలియో కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లి ఆర్‌డిఒ హరిప్రసాద్, వైద్యారోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు

ఒపిఎస్‌ను అమలు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి- మదనపల్లి

సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఒపిఎస్ పునరుద్ధరించే వారికే ఓటు వేయాలి అనే నినాదంతో మదనపల్లి వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిస్సార్ అహ్మద్‌ను కలసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న జగన్మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయులకు సకాలంలో పిఆర్‌సి, డిఎలు ఇచ్చి వారికి సౌకర్యాలను కల్పిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తి కావస్తున్నా ఇంతవరకు ఒక్క డిఎ బకాయి కూడా చెల్లించలేదని వాపోయారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు, కార్మికులకు ప్రధాన సమస్యగా ఉన్న సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసు కెళ్లాలని వినతి పత్రం అందజేశారు. స్పందించిన నిస్సార్ అహ్మద్ మాట్లాడుతూ ఒక ఉద్యోగిగా ఉద్యోగుల సమస్యలు తనకు తెలుసునని తప్పకుండా మీ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు టి.సుధాకర్ నాయుడు, జిల్లా కార్యదర్శులు పురం వెంకటరమణ టి భాస్కర్ రెడ్డి, డివిజన్ కన్వీనర్ ఎగవింటు సుధాకర్, నాయకులు రంజాన్, హరికృష్ణ, పయని నాగభూషణం పాల్గొన్నారు.



నిస్సార్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉమ్మడి సర్వీసు రూల్స్‌తో ఉద్యోగోన్నతలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘం నాయకుడు

ప్రజాశక్తి-పీలేరు

ఉమ్మడి సర్వీస్ రూల్స్ అనుసరించి ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులను చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షులు ఎస్. బాలాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం అన్నమయ్య జిల్లా, పీలేరు డివిజన్ సమావేశం జిల్లా అధ్యక్షులు నరసింహులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఉమ్మడి సర్వీసు రూల్స్ కోర్టు కేసులు కారణం చూపుతూ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల్లో జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి సర్వీసు రూల్సుతో సంబంధమున్న డైట్ అధ్యాపకులకు ఇటీవల తాత్కాలిక ప్రాతిపదికన సీనియర్ లెక్చర్లుగా ప్రమోషన్లు ఇచ్చారన్నారు. అదే తరహాలో ఉమ్మడి సర్వీసు రూల్స్ అనుసరించి సీనియారిటీ ప్రాతిపదికన ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్లు, డైట్ లెక్చరర్లు, ఎంఇఒ, డివైఇఒ పోస్టులోనూ ప్రమోషన్లు చేపట్టాలని వారు కోరారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ పరిష్కరించాలని, కొత్తగా ఏర్పాటు చేసిన హై స్కూల్ ప్లస్ లకు కూడా శాశ్వత ప్రాతిపదికన పీజీటీలను నియమించాలని, ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు అందాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి బి. దివాకర్ మాట్లాడుతూ 117 జీవోను రద్దుచేసి, ఉపాధ్యాయుల పని భారం తగ్గించాలని, ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ ప్రతి ఉన్నత పాఠశాలకు హెడ్ మాస్టర్, పిడి పోస్టులను తప్పనిసరిగా కేటాయించాలని, డిఇఒ పూల్లోని పండిట్, పీఈటీలకు ప్రమోషన్స్ చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమణా రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో 57 అనుసరించి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శివశంకర్, గోవర్ధన్, జనార్దన్ రెడ్డి, చంద్రశేఖర్, ప్రభాకర్, సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరానే ధ్యేయం

- గ్రామీణ ప్రాంతాలకు త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా
- 48 గంటల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు
- సబ్సిడీతో కూడిన సూర్య ఘర్ స్కీమ్
- ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ



ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నాం. జెఎల్‌ఎంల నుంచి గ్రేడ్-2 అధికారుల వరకు వారానికి రెండు దఫాలుగా సమీక్ష చేయడంతో అంతరాయానికి ముకుతాడు వేయగలుగుతున్నాం. గ్రామీణ ప్రాంతాలకు త్రీఫేస్ విద్యుత్‌ను సరఫరా చేయడం ద్వారా పారిశ్రామికాభివృద్ధికి ఊతమిచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. సబ్సిడీతో కూడిన సూర్యఘర్ స్కీమ్ ద్వారా అర్బన్ ప్రాంతాల్లోని ఇళ్లకు విద్యుత్‌సదుపాయం అందుబాటులో తీసుకొచ్చే ప్రయత్నం ఊపందుకుంది. దీంతో పాటు సంస్థకు ఆదాయాన్ని సమకూర్చడంలో భాగంగా డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించామని, ఫలితంగా బకాయిల భారాన్ని తగ్గించడానికి పాటుపడుతున్నాం. విద్యుత్‌చౌర్యం నిరోధించడంలో భాగంగా స్క్వాడ్స్ తనిఖీలతో రూ.75 లక్షలు వసూలు చేయగలిగామని పేర్కొంటున్న ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణతో ముఖాముఖి...

విద్యుత్ వినియోగం వివరాలు తెలపండి?

12 లక్షల మిలియన్ యూనిట్ల సాధారణ వినియోగం ఉంటుంది. ప్రస్తుతం 13 లక్షల నుంచి 15 లక్షల యూనిట్లు వరకు వినియోగం ఉంటోంది. 2023 ఫిబ్రవరిలో 355 మిలియన్ యూనిట్లు ఉండగా, 2024 ఫిబ్రవరిలో 414 మిలియన్ యూనిట్లు ఉంది.

జిల్లాలోని విద్యుత్ సర్వీసులు ఎన్ని?

జిల్లాలోని సబ్‌డివిజన్ల పరిధిలో 12,41,580 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 92,79,997 గృహ వినియోగ కనెక్షన్లు, 18,8065 వ్యవసాయ కనెక్షన్లు, 10,1552 వాణిజ్య కనెక్షన్లు, 711 ఇండస్ట్రియల్ కనెక్షన్లు, 6,534 కుటీర పరిశ్రమల కనెక్షన్లు, 9499 వీధి దీపాల కనెక్షన్లున్నాయి.

ట్రాన్స్‌ఫార్మర్లు లభ్యత ఎలా ఉంది?

జిల్లాలో 1,46,816 ట్రాన్స్‌ఫార్మర్లున్నాయి. ఇందులో త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్స్ 1,33,428, సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్స్ 1,3, 388 ట్రాన్స్‌ఫార్మర్స్ వరకు ఉన్నాయి.

నూతన సబ్‌స్టేషన్ల పనుల గురించి తెలపండి?

26 సబ్‌స్టేషన్లు (33కెవి) మంజూరు చేయడమైంది. ఇందులో 16 సబ్‌స్టేషన్ల నిర్మాణాలను పూర్తి చేయడమైంది. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని రామన్నూతలపల్లి, లోపట్నూతల, కోడూరు నియోజకవర్గంలోని బాలాయపల్లి, రెడ్డివారిపల్లి, తల్లెంవారిపల్లి, ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని మీనాపురం, కడప నియోజకవర్గంలోని మామిళ్లపల్లి సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

జగ్జీవన్‌జ్యోతి స్కీమ్ అమలు జరుగుతోందా?

జగజ్జీవన్‌జ్యోతి స్కీమ్ అమలవుతోంది. ఎస్‌సి, ఎస్‌టి గృహ వినియోగదారులకు నెలకు 200 యూనిట్లు ఉచితంగా సరఫరా చేయడం జరుగుతోంది. జిల్లాలో 73,462 ఎస్‌సి విద్యుత్ వినియోగదారులకు నెలకు రూ.217.42 లక్షలు, 9856 ఎస్‌టి గృహవిద్యుత్ వినియోగారులకు నెలకు రూ.23.90 లక్షలను రాష్ట్రప్రభుత్వం చెల్లిస్తోంది.

జగనన్న కాలనీల విద్యుద్దీకరణ ఎలా ఉంది?

జిల్లాలో జగనన్న కాలనీ విద్యుద్దీకరణ ప్రక్రియ చురుకుగా సాగుతోంది. జిల్లాలోని 704 కాలనీల్లో 575 కాలనీల్లో విద్యుద్దీకరణ పూర్తి చేయడ మైంది. మిగిలిన 129 కాలనీల్లో పనులు చేపట్టాల్సి ఉంది.

బకాయి, ఆదాయాల గురించి తెలపండి?

రూ.26 కోట్ల నుంచి రూ.28 కోట్లు బకాయి ఉండేది. తన హయాంలో రూ.20 కోట్లకు బకాయిలను తగ్గించడమైంది. జిల్లా ట్రాన్స్‌కో రూ.180 కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తోంది. ఇందులో హెచ్‌టి ప్రయివేటులైన్స్ కింద రూ.95 కోట్లు, ఎల్‌టి ప్రయివేటు లైన్స్ కింద రూ.95 కోట్లు ఆదాయం వస్తోంది.

అంతరాయాల నివారణ గురించి మాట్లాడండి?

24X7 నాణ్యమైన విద్యుత్ సరఫరా, అంతరాయాల నివారణపై దృష్టి సారించాం. 33 కెవి ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్పింగ్ జీరో స్థాయి నుంచి ఒన్ ఫీడ్స్ ఫర్ ఒన్ మన్త్ 144 ట్రిప్పింగ్స్ తగ్గకుండా చేయగలిగాం. ఈలెక్కన ఏటా 8,000 ట్రిప్పింగ్స్ నుంచి 2,000 ట్రిప్పింగ్స్ తగ్గించగలిగాం. ఈలెక్కన 6,000 ట్రిప్పింగ్స్ అంతరాయా లను నిరోధించగలిగాం.

రాజకీయ పార్టీలకు బుద్ధి చెబుదాం

వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకులు పులి శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లి

రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలకు వాల్మీకుల ఐక్యత, బలం, సత్తా తెలియజేయాలని వాల్మీకి సంఘం వ్యవస్థాపకులు పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీరామ కల్యాణ మండపంలో జయహో వాల్మీకి రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరుచ అనంతపురం, కడప కర్నూలు కృష్ణ గుంటూరు ప్రకాశం నెల్లూరు జిల్లాల నుంచి వివిధ వాల్మీకి సంఘాల నాయకులతో పాటు కర్ణాటక తమిళనాడు తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో వాల్మీకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకులు అన్ని రంగాలలోనూ వెనుకబడి ఉన్నారన్నారు. ఎస్‌టి సాధన కోసం దశాబ్దాల కాలంగా పూర్వీకులు నుంచి పోరాటం చేస్తున్నా రాజకీయ పార్టీలు పట్టించుకోవడంలేదని అన్నారు. వాల్మీకులు పోరాటంతోనే హోదా సాధించుకుందామని పిలుపునిచ్చారు. ముఖ్యంగా వాల్మీకులలో విద్య పరంగా ఎంతో వెనుకబడి ఉన్నారని, విద్య ఉంటేనే సమాజంలో గుర్తింపు ఉంటుందని, చదువుకున్న వారే వాల్మీకులలో చైతన్యం తీసుకురావాలని కోరారు. రాబోయే ఎన్నికలలో వాల్మీకులు అధికంగా ఉన్నచోట ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నిలబడి ప్రధాన రాజకీయ పార్టీలకు మన సత్తా చాటలని పిలుపునిచ్చారు. సమావేశానికి విచ్చేసిన వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో అయినా వాల్మీకులు నిలబడితే వారికి పూర్తి స్థాయిలో అన్ని విధాలా మద్దతు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సద్దాల జయసింహా, వలసల మంజు నాథ్, కుప్పం సురేష్ బాబు, పుంగనూరు సుకుమార్ బాబు, గుత్తి వీరభద్ర, కోలార్ వెంకట్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

నేడు 'నా ఓటే నా భవిష్యత్తు'కు రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

'నా ఓటే నా భవిష్యత్తు' పోటీలలో పాల్గొని రెండు లక్షల బహుమతిని పొందాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ అన్నారు. ఆదివారం ఎపి టుమారో సంస్థ నిర్వహిస్తున్న మై ఓట్.. మై ఫ్యూచర్ పోస్టర్లను రాజంపేటలోని తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొట్టమొదటిగా ఓటు వేసేవారు ఏపీ టుమారో సంస్థ నిర్వహిస్తున్న మై ఓటు మై ఫ్యూచర్ కార్యక్రమంలో పాల్గొని ఓటు పై ఒక మంచి సందేశాన్ని ఇచ్చే పోస్టర్, రిల్స్ , కొటేషన్లు పంపిస్తే వాటిల్లో ఉత్తమంగా ఎన్నికైన వారికి రెండు లక్షల నగదు బాహుమతి సొంతం అవుతుందన్నారు. ఈ నెల 4న రిజిస్ట్రేషన్‌చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్క నూతన ఓటరూ క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మార్చి 12 లోపు ఓటు గురించి మంచి సందేశాన్ని ఇచ్చే విధంగా రీల్స్ , కొటేషన్, పోస్టర్ పంపించాలన్నారు. అవకాశాన్ని నూతన ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మన ఓటు ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగలిగే నాయకున్ని, ఉద్యోగ అవకాశాలు సృష్టించగలిగే నాయకున్ని ఎన్నుకోవలసిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఏపీ టుమారో కార్యనిర్వాహకులు వెంకటేష్, హరి, సాయి, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

'సిఎం నిజ స్వరూపం బయటపడింది'

ప్రజాశక్తి-మదనపల్లి

'నా ఎస్టీలు.. నా ఎస్సీల..ు నా బీసీలు.. మైనారిటీ' అంటూ దొంగ పలుకులు పలికే ముఖ్యమంత్రి సిఎం జగన్మోహన్ రెడ్డి నిజ స్వరూపం మరోసారి బయట పడిందని జనసేన పార్టీ రాయలసీమ కో- కన్వీనర్ గంగారపు రామదాస్ చౌదరి పేర్కొన్నారు. ఆదివారం కమ్మవీధిలో జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు, కార్యకర్తలతో కలసి విలేకర్ల సమావేశంలో విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో రెంటచింటల గ్రామంలో సామినిబాయి అనే ఎస్‌టి మహిళా తాగడానికి నీళ్ల కోసం వాటర్ ట్యాంక్ దగ్గరికి వెళ్తే ఆమె తెలుగుదేశం పార్టీ సానుభూతి పరురాలు అని కక్ష కట్టి ట్రాక్టర్‌తో తొక్కించి చంపించారని చెప్పారు. కనీసం బాధ్యత గల ప్రభుత్వం కనీసం అనుమానాస్పద మృతి అని రాయకుండా ఏకంగా ప్రమాదకంగా చిత్రీకరించి కేసును కొట్టేసే ప్రయత్నం చేస్తున్న జగన్ ఎంతటికి దిగజారిపోయాడని పేర్కొన్నారు. సొంత తల్లి, చెల్లి బాబాయ్ కూతురు ప్రెస్ మీట్ పెట్టి జగన్మోహన్ రెడ్డి హంతకులను ప్రోత్సహించే రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదని, హంతకులు పాలించే వారికీ ఓటు వేయద్దని అంటున్నారని అన్నారు. సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, రాష్ట్ర చేనేత విభాగ ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర, జిల్లా జాయింట్ సెక్రటరీలు సనా ఉల్లా, గజ్జల రెడ్డెప్ప, రూరల్ మండలం అధ్యక్షులు గ్రానైట్ బాబు ,రామసముద్రం అధ్యక్షులు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర, పట్టణ ఉపాధ్యక్షులు పురం నగేష్, ఐటీ విభాగ నాయకులు లక్ష్మి నారాయణ, లవన్న, వీరమహిళ పట్టణ సెక్రటరీ నాగవేణి, జవిలి మోహన్ కృష్ణ, రూరల్ ప్రధాన కార్యదర్శి జంగాల గౌతమ్, జాయింట్ సెక్రటరీ రెడ్డి శేఖర్ రెడ్డి, నరేష్, సెక్రటరీ జయ, జనార్ధన్ పాల్గొన్నారు.

డేటా సైన్స్‌పై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్

ప్రజాశక్తి- మదనపల్లి

మదనపల్లి సమీపంలో ఉన్న ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం బిటెక్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు డేటా సైన్స్ సాధనాలపై ఉపయోగాలను అవగాహన కల్పించడానికి ప్రత్యేక సదస్సు నిర్వహించారు. వర్క్ షాప్‌లో దత్త టెక్నికల్ కన్సల్టెంట్, మహమ్మద్ రిజ్వాన్ అలీ, సీనియర్ మేనేజర్, బిజినెస్ డెవలప్మెంట్, డేటా క్రాఫ్ట్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్, హైదరాబాద్ వారు డేటా సైన్స్ ఫర్ స్టార్ టాప్ పైనీర్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డేటా సైన్స్ ఉపయోగించుకొని ఎలా ఉద్యోగ అవకాశాలు సంపాదించాలో తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్. రామలింగారెడ్డి మాట్లాడుతూ డేటా సైన్స్, టెక్నాలజీని ఉపయోగించుకుని ఎన్నో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని, డేటా సైన్స్‌ను ఉపయోగించుకుని భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లాలని విద్యార్థులకు తెలియజేశారు. హెడ్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డాక్టర్ కె. లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రస్తుత విద్యా విధానంలో డేటా సైన్స్ వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని వివరించారు. డాక్టర్ ఆర్.ఎం.డి . షఫీ మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మేధస్సును పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బద్వేలు

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల కల్పనలో చేసింది ఏమీలేదని, సిఎం సొంత జిల్లాకు చేసింది శూన్యమని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న తెలిపారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగుల పరిస్థితి దారుణంగా తయారయ్యింది అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకాలేదన్నారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ అని, చివరకు మొండిచెయ్యి చూపారని వాపోయారు. గడిచిన నాలుగు సంవత్సరాలు ఎనిమిది నెలల కాలంలో ఒక్క డిఎస్‌సి నిర్వహించని ఏకైక ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమే అన్నారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని కేవలం 6,100 పోస్టులతో దగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేశారు అన్నారు. అభ్యర్థులకు సమయం ఏమాత్రం సరిపోదని చెబుతున్న పట్టించుకోకుండా హడావుడిగా నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. గ్రూప్స్ కూడా అతి తక్కువ పోస్టుల విడుదల చేసి చేతులు దులుపుకొంది అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఒరిగింది శూన్యం అన్నారు. విభజన హామీలు లో ప్రధానమైంది కడప ఉక్కును కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మరిచాయి అన్నారు. బిజెపి, వైసిపి రెండు దొందు దొందే అన్నట్టు కడప ఉక్కు పై నాటకాలు ఆడుతున్నాయిన్నారు. రానున్న ఎన్నికలలో వీటి పై మాట్లాడుకుంటే యువత తిరగబడుతుంది అన్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల.శివకుమార్ మాట్లాడుతూ కడప జిల్లా లో నిరుద్యోగ యువతకు ప్రభుత్వం చేసింది ఏమి లేదు అన్నారు. ప్రధానంగా సోమశిల భు నిర్వాసిత యువతకు ఉద్యోగాల కల్పన హామీ అలాగే ఉన్నారు. చెన్నూరు చక్కెర కర్మాగారం పునః ప్రారంభం నోచుకోలేదు అన్నారు. గండికోట ప్రాజెక్టు భు నిర్వాసిత యువత కు ఉద్యోగాలు లేవన్నారు రానున్న రోజులలో డివైఎఫ్ఐ యువత కోసం మరింత ఉద్యమాలు చేపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్, రెబ్బా. నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి తులసిస్వర్ యాదవ్, నాయకులు నాగార్జున, షరీఫ్, నాగరాజు, కృష్ణా రెడ్డి, రమణా రెడ్డి, ఇమ్మనియెలు,బాల గురయ్యా, వెంకట రమణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న



ఇంటింటి ప్రచారంలో యల్లటూరు శ్రీనివాసరాజు

రాష్ట్రం జనసేన వైపు చూస్తోంది : 'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రోజురోజుకూ ప్రజలలో జనసేన పై ఆదరణ పెరుగుతోందని ఆ పార్టీ రాజంపేట నియోజకవర్గ నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు తెలియజేశారు. ఇంటింటికి జనసేన కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం పట్టణ పరిధిలోని అగ్రహారంలో పర్యటించారు. జానీబాషా పురం నుంచి అగ్రహారం వరకు ఆయనకు జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పూలదండలు, మేల తాళాలతో బాణాసంచా పేల్చుతూ ఘన స్వాగతం పలికారు. గడపగడప తిరుగుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఎన్నికల గుర్తు గాజు గ్లాసును ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో ప్రజలు జనసేన పార్టీకి మద్దతు పలికి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం జనసేన నాయకులు కొండేటి రవికుమార్ ఏర్పాటు చేసిన విందులో జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సింగంశెట్టి నరేంద్ర, మాజీ జెడ్పిటిసి యల్లటూరు శివరామరాజు, పోకల ప్రభాకర్, టిడిపి నాయకులు ఆదమరాజు శ్రీనివాసరాజు, గుణకల చిన్న, శివ, జనసేన నాయకులు పివిఆర్ కుమార్, అబ్బిగారి గోపాల్, కిచ్చగారి శివయ్య, రాజా ఆచారి పాల్గొన్నారు.

హక్కుల సాధనే మాదిగ మహానాడు లక్ష్యం

కడప అర్బన్ : తమ హక్కుల సాధనే లక్ష్యంగా మాదిగ మహానాడు పనిచేస్తుందని రాష్ట్ర అధ్యక్షులు బోయినపల్లె ప్రభాకర్ అన్నారు. ఆదివారం వైఎస్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో జిల్లా అధ్యక్షులు గున్న జయరాములు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న మాదిగ జాతి అభివృద్ధి లో మాత్రం దిగువ స్థాయిలో ఉందని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం మాదిగలకు దక్కాల్సిన ప్రభుత్వ లబ్ది అన్నింటిలో నిర్వీర్యం చేయడం దీనికి ఒక కారణంగా భావిస్తున్నామన్నారు. ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులు కూడా నిర్వీర్యం కావడం మాదిగ జాతికి మౌలిక సదుపాయాలకు అడ్డు కట్ట వేయడమేనని ఆరోపించారు.



మాట్లాడుతున్న హబీబుల్లాఖాన్

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి వెంటే ఉంటా..

-వైసిపి మదనపల్లి పరిశీలకులు కె.హబీబుల్లాఖాన్

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ప్రాణం ఉన్నంత వరకు వైసిపిలోనే ఉంటానని, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తమ నాయకుడని వైసిపి మదనపల్లి పరిశీలకుడు కె హబీబుల్లాఖాన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి వెంటే ఉంటామని వేరే పార్టీలోకి వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పార్టీ మారుతామని వచ్చిన వార్తలను ఆయనఖండించారు. మాజీ ముఖ్య మంత్రిని కలవడంపై అనవసరంగా రాజకీయం చేస్తున్నారని అన్నారు.మాజీ మున్సిపల్ కో-ఆప్షన్ సలావుద్దీన్ ప్రతిపక్ష పార్టీ నాయకులు ఇచ్చిన స్క్రిప్ట్‌ను చదివారని అన్నారు. చుక్కల భూములు రెగ్యులర్ చేయడానికి ఎమ్మెల్యే లంచాలు తీసుకుంటూ అవినీతికి పాల్పడుతున్నాడని నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా వైదొలుగుతానని సవాల్ విసిరారు. రాజకీయాల్లో ఓర్పు సహనం అవసరం అని కాంగ్రెస్ నుంచి బయటికి వచ్చి ఒక్కడే కష్టపడి ఈ రోజు సిఎం అయిన జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న మనం ఆయన సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటామని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తబ్రేజ్ ఖాన్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తగాది రాజశేఖర్ ఆధ్వర్యంలో బెంగళూరు నగరం సమీపంలోని హొసకోట వద్ద గల విద్యారణ్య ఆశ్రమంలో సుమారు 280 మంది వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులకు దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో సంస్థ సభ్యుల సహకారం మరువలేనిదన్నారు.అటు ఎపి ఇటు కర్ణాటకలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.




బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్ఐ

నిరుపేద కుటుంబానికి రూ.30 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని శ్రీరాముల మెట్ట మీద ఉన్న నిరుపేద కుటుంబానికి చెందిన అనే చిన్నారి రెండు సంవత్సరాల నుంచి స్కిన్ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని గ్రహించిన మా స్పందన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.30వేలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు స్థానిక ఎస్ఐ రమూరాం ఆధ్వర్యంలో అందించినట్లు తెలిపారు. పరిస్థితి కళ్ళ ఎదురుగా చూసి చలించి పోయిన స్థానిక ఎస్ఐ, కానిస్టేబుళ్లు మనోజ్, ఈశ్వర్లు నగదును బాధితుడి కుటుంబ సభ్యులకు అందించారు.



ఉత్సవ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సిఐ శ్రీనివాసులు

జర మహోత్సవ ప్రాంతాన్ని పరిశీలించిన సిఐ

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ సమీపంలో ఉన్న శ్రీకామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 9న జర మహోత్సవం నిర్వహించనున్నారు. ఆదివారం ఆ జర మహోత్సవ ప్రాంతాన్ని కలకడ సిఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.కార్యక్రమంలో కలకడ, కెవిపల్లి ఎస్ఐలు రామకృష్ణారెడ్డి, ఎస్.కె.రోషిముల్లా,సిబ్బంది పాల్గొన్నారు.

బిజెపిలో చేరిన 'మోదెం'

ప్రజాశక్తి-రాయచోటి



పురందేశ్వరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మోదెం

విజయవాడ బిజెపి రాష్ట్ర శాఖ కార్యాలయంలో రాయచోటి నియోజకవర్గం చిన్న మండెం మండలానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త మోదెం వీరాంజనేయప్రసాద్ బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాయింట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ శివప్రకాష్, రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, మధుకర్, స్టేట్ జనరల్ సెక్రటరీ బిట్ర శివనారాయణ, రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షుడు సాయిలోకేష్ సమక్షంలో చేరినట్లు తెలిపారు. రాబోయే రోజులలో పార్టీని బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

మహాశివరాత్రికి ముస్తాబవుతున్న బండెన్న స్వామి ఆలయం

- ఆలయ పీఠాధిపతిగాదాలు లక్ష్మీపతి స్వామి వెల్లడి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకునిమండలంలోని బీరంగి పంచాయతీ,శంకరాపురం వద్ద ఉన్న గూగుడి కొండలో వెలసిన బండెన్నస్వామి ఆలయం మహాశివరాత్రికి ముస్తాబవుతోంది.ప్రతి ఏడాది శివరాత్రికి ఈ ఆలయానికి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. విద్యుత్ కాంతులతో ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దుతారు. ముఖ్యంగా ఇక్కడ ఏర్పాటు చేసిన 151 దేవతామూర్తుల విగ్రహాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.ఆ విగ్రహాల ఎదుట చిన్న పిల్లలు సందడి చేస్తారు.ఈ సందర్భంగా ఆదివారం ఆలయ అర్చకులు పీఠాధిపతి గదాల లక్ష్మీపతిస్వామి మాట్లాడుతూ ప్రతి ఏడాది మహాశివరాత్రి వేడుకలను ఇక్కడ ఎంతో ఘనంగా జరుపుకుంటే సంగతి భక్తులకు తెలిసిందేనన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్ని సౌకర్యాలతోపాటు సులభంగా స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తున్నామన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శివరాత్రి ముందు రోజు 7న గురువారం శివకోటి అర్చన, శివరాత్రి రోజు సాసవల చిన్నమ్మ కథ చెప్పడమవును, చెక్కభజనలు తదితర కార్యక్రమాలు ప్రదర్శనలు ఉంటాయన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల కోసం ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు, దాతల సహకారంతో అత్యంత వైభవంగా మహా శివరాత్రి వేడుకలను నిర్వహిస్తామని వెల్లడించారు.రెండు రోజుల పాటు ఈ వేడుకలు జరుగుతాయని భక్తులు బండెన్న స్వామి ఆలయాన్ని సందర్శించాలని కోరారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-కలకడ

నిండు జీవితానికి రెండు చుక్కలు అనే నినాదంతో పుట్టిన బిడ్డ మొదలు ఐదు సంవత్సరాలు లోపగల చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు కలకడ ఎర్రకోటపల్లి వైద్యాధికారులు మల్లికార్జున ఎం.వి కిషోర్ కుమార్ రెడ్డిలు తెలిపారు. కలకడ పిహెచ్‌సి పరిధిలో 2284 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయవలసి ఉండగా 2262 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసి 99శాతం సాధించినట్లు వైద్యాధికారి తెలిపారు. అదేవిధంగా ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 1829 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయవలసి ఉండగా 1809 చిన్నారులకు పోలియో చుక్కలు వేసి 98.9 శాతం వేసినట్లు తెలిపారు. **పల్స్ పోలియో కేంద్రాన్ని తనిఖీ చేసిన డిఎంహెచ్ఒ..**మండలంలోని కదిరాయి చెరువులో జరుగుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని రాయచోటి డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య తనిఖీలు నిర్వహించారు.పుట్టిన బిడ్డ మొదలు ఐదు సంవత్సరాలు లోపు గల పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న తీరును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిపారు.పోలియో చుక్కలను ఇచ్చిన టార్గెట్ ప్రకారం పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జవహర్‌బాబు, మోహన్ ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య, పిహెచ్ఎన్, సుబ్బా రత్నమ్మ ,హెల్త్ సూపర్వైజర్స్ వెంకటేశ్వరరావు, రామకృష్ణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ రాజమ్మ, రెడ్డమ్మ , ఆరోగ్య కార్యకర్తలు ఎం ఎల్ హెచ్ పిలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** మండల పరిధిలో ఆదివారం 3913 మంది పిల్లలకు విజయవంతంగా పల్స్ పోలియో చుక్కలను వేసినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు పాల్గొన్నారు. 99.98శాతం, (0-5) సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగింది అన్నారు. కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. **మదనపల్లి:** పోలియో రహిత సమాజం కోసం ప్రజలు సహకరించాలని మదనపల్లి ఆర్‌డిఒ హరిప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక పట్టణంలోని రామారావు పాఠశాలనందు పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలను వేసి ప్రారంభించారు. పోలియో చుక్కలు తమ తమ పిల్లలకు5 సంవత్సరాలు లోపు గల వారందరికీ తప్పకుండా వేయించాలన్నారు. **వీరబల్లి:** పోలియో రహిత సమాజం నిర్మించడమే కేంద్ర ప్రభుత్వం ఆశ్రయంగా పెట్టుకున్నట్లు ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ మనిషా, డాక్టర్ సయ్యద్ జియా వుల్లా పేర్కొన్నారు.0-5 సంవత్సరాల లోపల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసి అంగవైకల్యం నుంచి బిడ్డలను రక్షించాలని ఆదేశించారు. **రామాపురం :** సున్నా నుంచి ఐదు సంవత్సరాలలోపు 4072 మంది చిన్న పిల్లలకు సంబంధించి 96.1 శాతం.3918 పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని మండల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. మండలంలో 4072 మంది 0-5 సంవత్సరాలలో పిల్లలు ఉండగా 3918 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మండలంలో మొత్తం 47 బూత్ కేంద్రాలు, 5 రూట్లు మండల పరిధి లోని ప్రాథమిక ప్రాథమిక ఉన్నత



కలకడ : పోలియో కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య



మదనపల్లె : పోలియో చుక్కలు వేస్తున్న ఆర్‌డిఒ హరిప్రసాద్

అంగన్వాడీ జిల్లా పరిషత్ పాఠశాలలోనూ రామాపురం బస్టాండ్‌లో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. **పీలేరు:**0-5 ఏళ్ల లోపు వయస్సు పిల్లల్లో పోలియో కారణంగా అంగవైకల్యం రాకుండా కాపాడు కోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పీలేరు సర్పంచ్ షేక్ జీనత్‌షఫీ, ఎంపిపి కంభం సతీష్ కుమార్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ కార్తీక్ కుమార్ మాట్లాడుతూ జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో 4,287 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు అందించాల్సి ఉండగా 4,203 మంది పిల్లలుకు పోలియో చుక్కలు వేసి 98 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ జయలక్ష్మి, హెచ్ఇ ఉషారాణి, సూపర్వైజర్ రమాదేవి, చిన్నప్ప, ఎంఎల్‌హెచ్‌పి సుస్మిత, అంగన్వాడీ కార్యకర్త రెడ్డెమ్మ, ఆశ కార్యకర్తలు రేణుక, వీరాకుమారి, నందిని పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల కేంద్రంలోని ఎస్‌బిడి సభ హైస్కూల్‌లో మండల వైద్యాధికారులు డాక్టర్ మనోజ్ చంద్ర ఆధ్వర్యంలో ఎంపిపి ముద్ద బాబుల్ రెడ్డి అధ్యక్షతన చిన్న పిల్లలకి పోలియో చుక్కలు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, జిల్లా సిఐటియు అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య, అంగన్వాడీ సూపర్వైజర్లు జయలక్ష్మి, వై.నిర్మల, వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు పాల్గొన్నారు. **రామసముద్రం** :మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నూరుల్లా, డాక్టర్ లీలాలు ఆధ్వర్యంలో చెంబకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మొత్తం 26 అంగన్వాడీ కేంద్రాలలో 26 టీంలు, 104 మంది వ్యాక్సినేటర్లు పాల్గొన్నారు. పిహెచ్‌సి పరిధిలో 98 శాతం మంది పిల్లలకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. రామసముద్రం పిహెచ్‌సి పరిధిలో 98.3 శాతం పూర్తి చేసినట్లు డాక్టర్ లీలా తెలిపారు.**తంబళ్లపల్లి :** పల్స్ పోలియో కార్యక్రమం 99.8 శాతం విజయవంతమైనట్లు కోసవారిపల్లి పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుపమ తెలిపారు. మండలంలో 4727 మంది ఐదు సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించారు. 33బూత్‌లు ఏర్పాటు చేసి 4718 పిల్లలకు పోలి యో చుక్కలను వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మునికు మార్, పిహెచ్ఎం సుమలత, సిహెచ్ఒ సిమ్రాన్, ఎఎన్ఎం ప్రమీల పాల్గొన్నారు.**కలికిరి:** పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైనట్లు మేడుకుర్తి సిహెచ్‌సి వైద్యులు రెడ్డప్ప తెలిపారు.**వాల్మీకిపురం:** నగరిమడుగు పిహెచ్‌సి పరిధిలో 96శాతం, చింతపర్తి పిహెచ్‌సి పరిధిలో 95శాతం చిన్నారులకు పోలియో చుక్కలను వేసినట్లు పిహెచ్‌సి వైద్యులు బి.కీర్తి, శ్రీవిద్య అన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు చౌదరి నయీమ్, మొహమ్మద్ వసీం, వైద్య సిబ్బంది సుధాకర్, ఇందిరారాణి, శారద, మౌనికపాల్గొన్నారు. **గాలివీడు :** గాలివీడు ఆరోగ్య కేంద్రం పరిధిలోని 46 పల్స్ పోలియో కేంద్రాలలో 90 శాతం పల్స్ పోలో విజయ వంతమైనట్లు డాక్టర్ మహమ్మద్ రఫీ తెలిపారు.**పెద్దమండ్యం :** మండల వ్యాప్తంగా 4230 మంది పిల్లలకు గాను 4200 మందికి పోలియోచుక్కలు వేసినట్లు మెడికల్ ఆఫీసర్ హిమనుల్లా తెలిపారు. ఇందుకోసం 30 పోలింగ్ కేంద్రాలు, ఒక మొబైల్ కేంద్రం, బస్టాండ్ లో ఒక్కటి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.**పీలేరు:** తలుపుల పిహెచ్‌సి పరిధిలో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు 4,074 మంది పిల్లలుండగా వారిలో 3,995 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసి 98 శాతం ప్రగతి సాధించినట్లు డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు.

ఒక్క అవకాశం ఇవ్వండి :'నల్లారి'

ప్రజాశక్తి-కలకడ

వైసిపి ప్రభుత్వం ఐదేళ్లుగా దోచుకోవడాలు, దాచుకోవడాలు, ప్రతిపక్షాలపై అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బంది పెట్టడం తప్ప చేసిందేమీ లేదని పీలేరు టిడిపి అభ్యర్థి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. మండల పరిధిలోని ఎనుగుంటపాలెం పంచాయతీ ఎగువ తాండా, దిగువ తాండా గ్రామాల్లో నిర్వహించిన బాబుష్యూరిటీ-భవిషత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు తెలియ జేస్తూ కరపత్రాలు పంచి మహిళకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇవ్వండి పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని అన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే యువతకు ఉద్యోగం, ఉపాధి, నిరు ద్యోగభృతి కల్పిస్తామని అన్నారు. మద్యం రేట్లు విపరీతంగా పెంచి, కల్తీ మద్యం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చేలాగాటమాడుతున్న జగన్‌రెడ్డికు వచ్చే ఎన్నికల్లో బుద్ధిచెప్పాలన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, కార్యకర్తలు పాల్గొన్నారు.**కలికిరి:** టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రజలలోకి తీసుకెళ్లాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సూచించారు.తన స్వగృహం నగిరిపల్లిలో నియోజకవర్గస్థాయి టిడిపి, జనసేన నాయకులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి జనసేన ఉమ్మడి మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరు మండలాల టిడిపి, జనసేన అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టిడిపి పథకాలను ప్రజలకు వివరిస్తున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా :ఎమ్మెల్యే



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

ప్రజాశక్తి-ములకలచెరువు

నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బురకాయలుకోట, సెంటర్ స్కూల్ గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రతి గ్రామానికి సిసి రోడ్లతో పాటు తారు రోడ్లు వేసినట్లు తెలిపారు. వందశాతం సంక్షేమ పథకాల అమలు చేసిన ఘనత వైసిదేనని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి సమస్యలు పరిష్కారానికి అధికారులు ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి సాయిలీల, జడ్‌పి టిసి మోహన్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ మాధవరెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు, జిల్లా కార్యవర్గ సభ్యులు రవీంద్రారెడ్డి, నాయకులు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలోని శ్రీరాంనగర్, గండి రోడ్డు ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బిటెక్ రవిరెడ్డి, ఆయన సతీమణి లతారెడ్డి ఇంటింటికి తిరిగి పార్టీ అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కులమతాలకతీతంగా తెలుగు దేశం పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రిగా కావాలన్నారు. చంద్రబాబు ఒక విజన్ ఉన్న నాయకుడని చెప్పారు. కార్యక్రమంలో పులివెందుల జనసేనా ఇన్‌ఛార్జి హరీష్, మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, జయచంద్రారెడ్డి, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, డివి సుబ్బారెడ్డి, ఆర్‌వి రమేష్, పూల అల్లాబకష్, గోగుల మల్లికార్జున, వల్లెపు రమణ, ఆది, మహమ్మద్, వేమకుమార్, డక్కా రమేష్, సుబ్బరాయుడుతోపాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపి హామీ పత్రాలు అందజేత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాజుపాలెం మండలం గాదేగూడూరు గ్రామంలో ఆదివారం టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి టిడిపి ప్రకటించిన ఆరు సంక్షేమ పథకాలను వివరించి హామీ పత్రాలను అందజేశారు. ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం కూడా ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి పక్కాగా చేయాలన్నారు. కార్యక్రమంలో రవికాంత్‌రెడ్డి, సురేష్ నాయుడు, రోషిరెడ్డి, నరసింహారెడ్డి, పత్తిపాటి అర్జున్ చౌదరి, హరి నాయుడు, హరికృష్ణ, గణేష్ నాయుడు, శంభురెడ్డి, శరత్ కుమార్, నాగేశ్వరరావు నాయుడు, సుబ్బరాయుడు, నాగార్జున నాయుడు, నాగభూషణ్ నాయుడు పాల్గొన్నారు.

మొదటి స్థానంలో నిలిచిన 'మాదన్న' విద్యార్థి

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు పట్టణానికి చెందిన మాదన్న మెమోరియల్ హైస్కూల్ 5వ తరగతి విద్యార్థి బి.తిరుమలదేవి అబాకస్ పోటీలలో రాయలసీమ జోన్ లెవెల్‌లో మొదటి స్థానంలో నిలిచినట్లు పాఠశాల కరెస్పాండెంట్ ఎస్.వెంకట్‌రాముడు తెలిపారు. కడప గాంధీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన అబాకస్ పోటీలలో తిరుమలాదేవి ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలో పాల్గొనే అవకాశాన్ని పొందారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్రంలోని అన్ని శిల్పారామాల్లో పనిచేస్తున్న హౌస్ కీపింగ్, సెక్యూరిటీ గార్డు లకు వేతనాలు పెంచడంతో శిల్పారామంలో పనిచేస్తున్న సిబ్బంది ఆదివారం ఎఒ సుధాకర్ ఆధ్వర్యంలో సి.ఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జీతాలను పెంచాలని అడిగిన తమ కోరికను తీర్చారని అన్నారు .ఫిబ్రవరి నుంచి జీతాలు పెంచి ఆదుకున్నారని కొనియాడారు.



మాట్లాడుతున్న కరస్పాండెంట్ శ్రీనివాసులు

ఇష్టంతో చదివితే విజయం సొంతం

ప్రజాశక్తి-పుల్లంపేట

విద్యార్థులు తమ విద్యాభ్యాసంలో కష్టపడి ఇష్టంగా చదివితే భావి తరాలకు విజయం సొంతమని శాంతినికేతన్ హై స్కూల్ కరస్పాండెంట్ ఎ.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని శాంతినికేతన్ హైస్కూల్ ఆవరణలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో కరస్పాండెంట్ విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన చదువు ఆవశ్యకమని విద్యాభ్యాసం ఒక ప్రణాళిక బద్ధంగా చదివి త్వరలో జరగబోయే వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తు చదువుల కోసం విద్యపై దృష్టి సాధించి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను అలరించాయి.కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్రానికి ప్రత్యేకహోదా రావాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. స్థానికంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధి కారంలోకి వస్తే ఇందిరమ్మ అభయం పథకం అమలవుతుందన్నారు. ఈ పథకం కింద ప్రతి నిరుపేద కుటుంబానికి నెలకు రూ.5000 ఆర్థికసాయం అందుతుందన్నారు. జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాల డబ్బు కలిపినా ఇందిరమ్మ అభయ పథకానికి సరిరావు అని తులసిరెడ్డి తెలిపారు. తాను మళ్లీ ముఖ్యమంత్రి కాకుంటే ప్రస్తుతం అమలవుతున్న పథకాలన్నీ నిలిచిపోతాయని జగన్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. హంతకుల పార్టీ అయిన జగన్‌కు ఓటు వేయొద్దని ఒక చెల్లెలు సునీత, ఆర్థిక నేరస్తుల పార్టీకి ఓటు వేయొద్దని మరో చెల్లెలు షర్మిల చెబుతుంటే జగన్ ముఖ్యమంత్రి పీఠాన్ని అతుక్కోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ప్రజలంతా కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోగుల రమేష్, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగల్‌రెడ్డి, సింహాద్రిపురం మండలశాఖ అధ్యక్షులు శివ, ఉపాధ్యక్షులు బ్రహ్మం, వేంపల్లి మండల శాఖ బోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి పాలెం సుబ్బరాయుడు, నాగరాజు, తరుణ్ కుమార్‌రెడ్డి, నిఖిల్, స్టాన్లీబాబు, విజయేంద్ర, వినయ్ పాల్గొన్నారు.

అవయవ దానంపై విస్తృత అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - చక్రాయపేట

అవయవదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు పేర్కొన్నారు. మండ లంలోని మారెళ్లమడక గ్రామం లో ఆదివారం ఇడుపుల పాయ ట్రిపుల్‌ఐటి ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-9, పులివెందుల స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో అవయవ దానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అవయవ దానం ఆవశ్యకత, విశిష్టతను వివరించారు. అవయవదానం చేస్తే మరణించినా మరోసారి అవయవాల అనారోగ్యంతో బాధ పడుతున్న వారి రూపంలో మరణించిన కూడా మళ్లీ జీవించే అవకాశం ఉందని తెలిపారు. ఏదైనా ప్రమాదం, దీర్ఘకాలిక వ్యాధితో కోమాలో ఉండగా వారి కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు అవయవదానాలు చేయాలన్నారు. మనిషి మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలు దానం చేయడం ద్వారా అంధత్వంతో ఈ లోకాన్ని చూడలేక అంధకారంలో ఉన్న వారి జీవితాలలో వెలుగులు నింపవచ్చన్నారు. అనంతరం నేత్రదానం, అవయవ దానం ప్రతిజ్ఞ చేయించిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో 85 మంది విద్యార్థులు నేత్రదాన అంగీకార పత్రాలలో సంతకాలు చేసి, రాజుకు అందజేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం నవనీత, సర్పంచ్ నరసింహులు, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్, ట్రిపుల్‌ఐటి విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక నెహ్రూ రోడ్డులోని శ్రీ వేదవ్యాస డిగ్రీ కాలేజి ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో మూడవరోజు పెద్దశెట్టిపల్లె గ్రామంలో విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎల్.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధులు దరిచేరవని తెలిపారు. కళాశాల ప్రెసిడెంటు జి.సుదర్శనరెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ వి.రామలక్ష్మిరెడ్డి మాట్లాడుతూ వేసవిలో అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో డిహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుందని, ఈ సమస్య ఎదురుకాకుండా ఉండాలంటే నీరు, నిమ్మరసం, కొబ్బరి నీరు, గ్లూకోజ్ వంటి వాటిని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్లు కె.నాగరాజ, ఎస్.పి.యాసిన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్



బాధితులను విచారిస్తున్న సిఐ యువరాజ్

తల్లిదండ్రులపై తనయుడి దాడి : కేసు నమోదు

ప్రజాశక్తి-మదనపల్లి

ఆస్తి పంపకాల విషయంలో తల్లి దండ్రులపై తనయుడు దాడికి పాల్పడినట్లు వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్ కావడంతో కొడుకుపై కేసునమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సిఐ యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం సాయంత్రం దాడి చేసిన ఘటన ఆదివారం మదనపల్లిలో వెలుగు చూసిందని అన్నారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాదితులనుపరామర్శించినట్లు తెలిపారు. నీరుగట్టువారిపల్లె, అయోధ్యనగర్‌లో నివాముస్న దంపతులు వెంకట రమణారెడ్డి, లక్ష్మమ్మల కుమారుడు శ్రీనివాసులురెడ్డికి భూ వివాదం ఉందని అన్నారు. తల్లి దండ్రులు దన్నం పెడుతున్నా వదల కుండా కసాయి కొడుకు శ్రీనివాసులురెడ్డి కొట్టే దెబ్బలకు వృద్ధ దంపతులు తల్లడిల్లిపోతున్న ఘటన తీవ్రంగా కలవేసిందన్నారు. ఎవరైనా తమ తల్లిదండ్రుల పట్ల వేధింపులకు గురిచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

విద్యుత్ స్తంభం పైనుండి పడి సురేంద్ర అనే వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన బి.కొత్తకోట మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని గండువారిపల్లికి చెందిన సురేంద్ర అతిగా మద్యం సేవించి, మద్యం మత్తులో విద్యుత్ స్తంభంపైకి ఎక్కి విద్యుదాఘాతానికి గురై కింద పడి పోయా డని అన్నారు. స్థానికులు 108కు సమాచారం అందించి మదనపల్లి జిల్లా ప్రభుత్వ తరలించినట్లు తెలిపారు.